క్లుప్తంగా

ఆది, సోమవారాల్లోనూ కౌంటర్లు

తెనాలి అర్బన్: పన్నులు చెల్లించాల్సిన వారి సౌకర్యార్థం ఆది, సోమవారాల్లో కౌంటర్లు పని చేస్తాయని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. కార్యాలయంలోని తన చాంబర్‌లో శుక్రవారం సాయంత్రం సచివాలయ, రెవెన్యూ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీతో పన్నుల చెల్లింపు ముగియనున్నట్లు చెప్పారు. ఆ తర్వాత చెల్లించే వారిపై అపరాధ రుసుం విధిస్తామని తెలిపారు. బకాయిదారులను గుర్తించి వారితో పన్నులు చెల్లించే విధంగా చూడాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో ఆర్వో రాంప్రసాద్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నేడు కొల్లిపర మండల సర్వసభ్య సమావేశం

కొల్లిపర: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం మధ్యాహ్నం రెండున్నర గంటలకు కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో పాటు అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

క్రెడిట్ క్యాంపునకు 266 మంది హాజరు



కొల్లిపర: బీసీ కార్పొరేషన్ నుంచి సబ్సిడీ రుణాల మంజూరు నిమిత్తం శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో క్రెడిట్ క్యాంపు నిర్వహించారు. మండలంలోని 20 గ్రామాల పరిధిలో 357 మంది దరఖాస్తు చేసుకోగా, ఇంటర్వ్యూలకు 266 మంది హాజరైనట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని వివిధ బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

శానిటేషన్ ఉద్యోగులకు సన్మానం



తెనాలి అర్బన్: ఇటీవల నిర్వహించిన స్వచ్ఛ తెనాలి చాలెంజింగ్ పోటీల్లో 11వ వార్డు శానిటేషన్ ఉద్యోగులు 2వ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ కఠారి రత్నకుమారి, హరీష్ దంపతులు శుక్రవారం వార్డులో వారిని సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వై.అనుపమ, శానిటరీ సెక్రటరీలు సాగరయ్య, హవేలా ప్రియ, నగర దీపిక వి.ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

ముగిసిన సదరం క్యాంప్



తెనాలి అర్బన్: దివ్యాంగుల ధ్రువ పత్రాలను పునః పరిశీలన జరిపే కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరం క్యాంప్ శుక్రవారంతో ముగిసింది. ఆర్థో, ఈఎన్‌టీ, సైక్రాటిక్ విభాగాలకు చెందిన వికలాంగులు వైద్యశాలకు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి పర్యవేక్షించారు.

పండ్ల మార్కెట్ వేలం పాట వాయిదా

తెనాలి అర్బన్: పాటదారులు రాకపోవడంతో పురపాలక సంఘ పరిధిలోని పండ్ల మార్కెట్ వేలం పాట వాయిదా పడింది. మరలా నిర్వహించే వరకు పురపాలక సంఘ ఉద్యోగులు ఆశీలు వసూలు చేసేందుకు నిర్ణయించినట్లు మున్సిపల్ రెవెన్యూ అధికారి రాంప్రసాద్ తెలిపారు. గురువారం జరిగిన వేలం పాటలో కూరగాయల మార్కెట్‌ను రూ.12 లక్షలు, చేపలు, కోళ్లు, మాంసం మార్కెట్, జంతు వధశాలను రూ.4.78 లక్షలు, సత్యనారాయణ పార్కులోని పై అంతస్తులో క్యాంటిన్‌ను రూ.90వేలు, ఫుడ్ కోర్టు రూ.లక్ష, వెహికల్ పార్కింగ్ రూ.78వేలకు పాడుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వేలం పాటల ద్వారా మున్సిపాలిటీకి రూ.19.46 లక్షల ఆదాయం సమకూరిందని ఆయన తెలియజేశారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

తెనాలి అర్బన్: తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు కమిషనర్ బండి శేషన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. కౌన్సిలర్లు, కో–ఆప్షన్, ఎక్స్‌అఫీషియో సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

విద్యుత్ చార్జీల భారం.. దుర్మార్గం

సీపీఎం నేతల ధర్నా

- ఎన్నికల ముందు కూటమి నేతల వ్యాఖ్యలను గుర్తు చేసిన నేతలు
- గతంలో పెంచి అధికారం కోల్పోయారంటూ హెచ్చరికలు



విద్యుత్ డివిజనల్ ఇంజనీరు కార్యాలయం ఎదుట సీపీఎం నేతల ధర్నా

తెనాలి: ప్రజలపై భారం మోపుతున్న అన్ని రకాల అదనపు విద్యుత్ చార్జీలను రద్దుచేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక చెంచుపేటలోని విద్యుత్ డివిజన్ కార్యాలయం ఎదుట నాయకులు ధర్నా చేశారు. అనంతరం డివిజనల్ ఇంజినీరు వి.చిరంజీవిని కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ముందుగా ధర్నాను ఉద్దేశించి సీపీఎం తెనాలి కార్యదర్శి కొల్లిపర బాబూప్రసాద్ మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో విద్యుత్ చార్జీలపై కూటమి నాయకుల మాటలు , ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. నేడు అన్ని కేటగిరీల వినియోగదారులు పెరిగిన విద్యుత్ చార్జీల భారం భరించలేకపోతున్నారని తెలిపారు. ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేనందుకు అధికార పార్టీల నేతలు కనీసం పశ్చాత్తాపం కూడా వ్యక్తం చేయడం లేదని దుయ్యబట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి డిస్కంలకు సబ్సిడీ ఇచ్చి వినియోగదారులపై మోపిన ట్రూ అప్, సర్‌చార్జీల భారాన్ని రద్దు చేయాలని కోరారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు అవసరమా అంటూ గతంలో నారా లోకేష్, పయ్యావుల కేశవ్‌ల ప్రకటనలను గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక ఈ విధంగా మాట మారిస్తే రైతులు ఏమవ్వాలని ఆయన ప్రశ్నించారు. సీఐటీయూ నాయకుడు షేక్ హుస్సేన్‌వలి మాట్లాడుతూ విద్యుత్ చార్జీల భారంతో పరిశ్రమలు మూతపడి కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని చెప్పారు. రెండు వేల సంవత్సరంలో విద్యుత్ చార్జీలను ఇలాగే పెంచి అధికారం పోగొట్టుకున్న విషయం మర్చిపోవద్దని పాలకులను హెచ్చరించారు. కార్యక్రమంలో జి.వెంకట సుబ్బయ్య, కె.రవికుమార్, కె.శ్రీనివాసరావు, మురళీకృష్ణారెడ్డి, పవన్, తేజారెడ్డి, కుర్రా వెంకటరమణ, వై.ప్రసాద్. సీహెచ్ అంజయ్య, వి.లక్ష్మీనారాయణ, శెట్టి ఏసోబు పాల్గొన్నారు.



కొల్లిపరలో నిరసన తెలుపుతున్న నాయకులు

కొల్లిపరలో నిరసన

కొల్లిపర(తెనాలి): విద్యుత్ బిల్లుల భారం తగ్గిస్తామని ఎన్నికల సమయంలో హామీనిచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు భారం మోపటం దుర్మార్గమని సీపీఎం సీనియర్ నాయకుడు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ఖండించారు. సీపీఎం, సీఐటీయూ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం కొల్లిపరలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట కరెంటు బిల్లులు పెంపుపై నిరసన తెలియజేశారు. విద్యుత్ ఛార్జీల భారంపై నినాదాలు చేశారు. ట్రూ అప్, సర్ చార్జీల భారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించి, వినియోగదారులపై భారం రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే షాపులకు స్మార్ట్ మీటర్లు బిగించటంతో గతంకంటే రెట్టింపు బిల్లులు వస్తున్నాయని యజమానులు లబోదిబోమంటున్నారని తెలిపారు. వ్యవసాయానికి, ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించే విధానాన్ని విడనాడకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కోట చంద్రశేఖరరావు, బత్తుల సుబ్బారావు, ఎం రమేష్, ఎ.పూర్ణచంద్రరావు, పి.ఏసుపాదం, కె.పిచ్చయ్య, ఎం.మరియమ్మ, జి.దేనమ్మ, ఎస్.వెంకటేశ్వర్లు, కె.సీతమ్మ పాల్గొన్నారు.

నేడు 'స్వరలయ' రజతోత్సవ ఉగాది సంబరాలు

వివిధ రంగాల్లో ప్రముఖులకు పురస్కారాలు



పూర్ణచంద్



వసుంధర



డాక్టర్ విజయలక్ష్మి



షేక్ తిరుమలబి



వసంతదుర్గ

తెనాలి: పట్టణానికి చెందిన సంగీత, సాంస్కృతిక సంస్థ స్వరలయ వేదిక రజతోత్సవ ఉగాది వేడుకలను శనివారం సాయంత్రం నిర్వహించనున్నారు. స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో సాయంత్రం ఆరు గంటలకు గాయని ఆకెళ్ల హిమబిందు ప్రార్థనతో ఆరంభమయే విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలకు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ విశ్రాంత సీఈవో దైవాల వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు అధ్యక్షత వహిస్తారు. ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొంటారు. 'ఉపన్యాస భూషణ' గుడిమెళ్ల శ్రీకూర్మనాథ్, పరాశరం వెంకట రామగోపాల్, రావిపాటి ప్రేమకుమార్, పిరమిడ్ యోగసాధకుడు డాక్టర్ జాస్తి వెంకట సుబ్బారావు ప్రసంగిస్తారు. చలమలశెట్టి మహతి కూచిపూడి నృత్యం, కవి సమ్మేళనం, చలనచిత్ర గీతాలాపనతోపాటు వివిధ రంగాల్లో కృషిచేసిన ప్రముఖులకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సాయి లక్కరాజు ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలను ప్రదానం చేస్తారు.

- పట్టణానికి చెందిన ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ కోశాధికారి, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఈదర వెంకట పూర్ణచంద్ పురస్కారం అందుకోనున్నవారిలో ఒకరు. రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా చేసిన సమాజసేవ, ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్‌గా నిర్వహిస్తున్న సేవాకార్యక్రమాలకు గుర్తింపుగా ఆయనకు స్వరలయ వేదిక రజతోత్సవ ఉగాది పురస్కారాన్ని బహూకరిస్తున్నట్లు సాయి లక్కరాజు తెలియజేశారు.
- ఉపాధ్యాయినిగా వృత్తిని ప్రారంభించి, ప్రవృత్తి అయిన సంగీతానికి జీవితాన్ని అంకితం చేసిన కొండపి వసుంధర రెండు దశాబ్దాలుగా అన్నమాచార్య కీర్తనల ప్రాచుర్యానికి విశేషంగా కృషి చేస్తున్నారు. ఉచితంగా అన్నమయ్య కీర్తనలను బోధిస్తూ, తాదాత్మ్యంగా గానం చేస్తూ ఆయా కీర్తనల మాధుర్యాన్ని జన బాహుళ్యానికి అందజేస్తున్నారు. సంగీత రంగం నుంచి ఆమె ఉగాది పురస్కారాన్ని అందుకోనున్నారు.
- పరిశోధన రంగం నుంచి పట్టణానికే చెందిన డాక్టర్ దాసరి విజయలక్ష్మికి ఈ గౌరవం దక్కింది. జేఎంజే మహిళా కాలేజీలో అధ్యాపకురాలిగా చేస్తున్న విజయలక్ష్మి, విముక్త సంచార జాతులైన బుడబుక్కల, దొమ్మరి, మొండిబండ, పాముల కులస్తుల జీవనవిధానం–సాహిత్యం–పరిశీలన' అంశంపై పరిశోధన చేసి, వారి కళాత్మకమైన జీవన విధానాన్ని ప్రపంచానికి అందించారు. ఈ పరిశోధనకు డాక్టరేట్ లభించింది.
- రంగస్థలంపై పురాణపాత్రలను మేటిగా పోషిస్తూ, నంది అవార్డులతోపాటు పరిషత్ పోటీల్లో 130 పైగా ఉత్తమనటి పురస్కారాలను అందుకున్న 'రంగస్థల సీత' తెనాలి కళాకారిణి షేక్ తిరుమలబి స్వరలయ వేదిక రజతోత్సవ ఉగాది పురస్కారాన్ని అందుకోనున్నారు.
- పట్టణానికి చెందిన నృత్యకళాకారిణి, నృత్యగురువు వసంతదుర్గకు ఉగాది పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. 16 ఏళ్ల వయసులోనే 'నాట్య మయూరి'గా రంగస్థలంపై మెరిసిన వసంతదుర్గ తర్వాతి కాలంలో శ్రీలక్ష్మీనారాయణ కూచిపూడి నృత్య కళానికేతన్‌ను స్థాపించి, ఎందరో విద్యార్థినులకు శిక్షణనిస్తున్నారు.

'సుందర తెనాలి' కలను సాకారం చేసుకుందాం

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



నాలుగో వార్డులో పర్యటిస్తున్న కమిషనర్ శేషన్న , కౌన్సిలర్ వెంకటేశ్వరరావు

తెనాలి అర్బన్: సుందర తెనాలి కలను సాకారం చేసుకునేందుకు పట్టణ ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న కోరారు. నాలుగో వార్డులో శుక్రవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుర్రిపాలెం రోడ్డులో గల కంపోస్టు యార్డులో చెత్తను పూర్తిగా తొలగించనున్నట్లు తెలిపారు. ఆ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఆయన వెంట కౌన్సిలర్ అడుసుమల్లి వెంకటేశ్వరరావు, ఏఈ సూరిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, టీపీవో సాంబశివరావు, పలువురు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

శిల్పశాలను సందర్శించిన కమిషనర్



తెనాలి అర్బన్: ఆటోనగర్‌లోని సూర్య శిల్పశాలను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న శుక్రవారం సందర్శించారు. ఉగాది పురస్కారాల్లో అందజేసే కాంస్య హంసలు, తెలుగు తల్లి ప్రతిమలను శిల్పశాల నిర్వాహకులు కాటూరి వెంకటేశ్వరరావు, రవి చంద్ర, శ్రీహర్ష తయారు చేశారు. వాటిని పరిశీలించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏసీపీ శివన్నారాయణ, ఏఈ సూరిబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు



పోటీల కోసం సిద్ధం చేసిన బరి

తెనాలి రూరల్: ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన, ఆవు పాల ప్రదర్శన పోటీలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. తెనాలి మార్కెట్ యార్డులో ఏర్పాట్లను పూర్తి చేశారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కన్వీనర్‌గా గత కొన్నేళ్లుగా పోటీలను నిర్వహిస్తున్నారు. వారం రోజుల పాటు సేద్యం, పాల పళ్ల నుంచి సీనియర్స్ వరకు వివిధ విభాగాల్లో పోటీలు జరుగనున్నాయి. వీటితో పాటు వ్యవసాయం, పాడిని ప్రోత్సహించేలా రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. ఏడాది లోపు వయసున్న దూడలకు అందాల పోటీలు, ఆవు పాల పోటీలను నిర్వహించనున్నారు. పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ప్రతి రోజు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, కేంద్ర మంత్రులు, ప్రముఖులు హాజరు కానున్నారని తెలిపారు. ఏర్పాట్లను ఎమ్మెల్యే ఆనందబాబు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ శుక్రవారం పరిశీలించారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కిరణ్ చందు

మంగళగిరి: మంగళగిరి మార్కెట్ యార్డు చైర్మన్‌గా టీడీపీ నాయకుడు జువ్వాది కిరణ్ చందు నియమితులయ్యారు. శుక్రవారం ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పెదవడ్లపూడి గ్రామానికి చెందిన కిరణ్ చందు మంగళగిరి రూరల్ తెలుగు యువత కార్యదర్శిగా రెండు సార్లుగా పని చేశారు. ప్రస్తుతం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా, టీడీపీ శాశ్వత సభ్యుడి ఉన్నారు.

వన్‌టౌన్ సీఐకి క్యాష్ రివార్డ్



ఎస్పీ నుంచి రివార్డు అందుకుంటున్న సీఐ మల్లికార్జునరావు

తెనాలి రూరల్: శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్న తెనాలి వన్‌టౌన్ సీఐ వి. మల్లికార్జునరావుకు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ శుక్రవారం క్యాష్ రివార్డ్ అందజేశారు. పట్టణానికి చెందిన రౌడీషీటర్ అన్నం రమేష్ బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించి నేరానికి పాల్పడడంతో అతన్ని అరెస్ట్ చేసి తహసీల్దార్ ఎదుట హాజరుపరచగా, ఆయన నెల రోజులు రిమాండ్ విధించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం గుంటూరు ఎస్పీ కార్యాలయంలో జరిగిన నేర సమీక్ష సమావేశంలో సీఐ మల్లికార్జునరావుకు ఎస్పీ క్యాష్ రివార్డ్ అందజేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది నిబద్ధతతో పని చేయాలని ఆయన సూచించారు.

ఉపాధ్యాయుడిగా రఘునాథరావు సేవలు ప్రశంసనీయం



తెనాలి అర్బన్: విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో రఘునాథరావు కృషి ప్రశంసనీయమని తెనాలి మండల విద్యాధికారులు మేకల లక్ష్మీనారాయణ, వి.జయంతిబాబు కొనియాడారు. నాజర్‌పేటలోని లూథరన్ అప్పర్ ప్రైమరీ స్కూలులో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన మునిపల్లి వెంకట రఘునాథరావు వీడ్కోలు సభను పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాధికారులు మాట్లాడుతూ రఘునాథరావు బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేర్కొన్నారు. కవి, రచయితగా సమాజానికి సేవలందించారని తెలిపారు. అనంతరం రఘునాథరావు దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పి.రత్న ప్రియదర్శిని, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మంత్రి నాదెండ్ల మనోహర్



రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి టౌన్: పేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. రూరల్ మండలం నందివెలుగులోని మదీనా మసీదు వద్ద శుక్రవారం ముస్లింలకు ఆయన రంజాన్ తోఫా పంపిణీ చేశారు. కూటమి నేతలు నన్నపనేని లింగారావు, నన్నపనేని బసవపున్నయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మనోహర్ మాట్లాడుతూ రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని బియ్యం, సేమ్యా, ఆయిల్, నెయ్యి, డ్రైఫ్రూట్స్ తదితర పండుగ సరుకులను ఉచితంగా అందించినట్లు తెలిపారు. షాదీఖానా నిర్మాణానికి రూ.40లక్షలు కేటాయించామని, కొద్దిరోజుల్లో పనులు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు అజ్మతుల్లా, షేక్ సుభాని, బుజ్జి, అక్బర్, మౌలాలి, మహబూబ్ సుభాని, షకూర్ బాషా పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందును ప్రారంభించిన మంత్రి

తెనాలి అర్బన్: మాజీ కౌన్సిలర్ షేక్ జాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో మారీసుపేట 22వ వార్డులో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందును రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో షేక్ రహిమా, 22వ వార్డు జనసేన నాయకులు పాల్గొన్నారు.

నీటి నిల్వలతో దోమల వృద్ధి

మలేరియా విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న మలేరియా అధికారులు

తెనాలి అర్బన్: నీటి నిల్వలే దోమల వృద్ధికి ప్రధాన కారణమని తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం చంద్రబాబునాయుడు కాలనీలో దోమల నియంత్రణపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిల్వ ఉన్న నీటిలో దోమలు గుడ్లు పెడతాయని తెలిపారు.
అవి ఎనిమిది నుంచి 10 రోజుల సమయంలో దోమలుగా రూపాంతరం చెందుతాయని వివరించారు. వారానికి ఒకసారైన నీటి నిల్వలను మార్చుకుంటూ ఉండాలని సూచించారు. మురుగు కాల్వల్లో చెత్త వేయడం వల్ల ప్రవాహం నిలిచిపోయి దోమలకు నిలయాలుగా మారతాయని చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. సబ్ యూనిట్ మలేరియా అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ దోమకాటు వల్ల మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, బోధకాలు, మెదడు వాపు తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి మాట్లాడుతూ 2030 నాటికి మలేరియా రహిత దేశంగా రూపొందించేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. ఇంటిలో కూలర్లు, ఫ్రిజ్‌లు, గాబులు, రోళ్లు, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ వస్తువులను ప్రతి శుక్రవారం శుభ్రం చేయాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో కూడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. ఇలా చేయడం వలన దోమల వ్యాప్తి తగ్గే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ దీపాల శ్రీనివాసరావు, సయ్యద్ కరీముల్లా, షేక్ నవీద్, శరత్‌బాబు పాల్గొన్నారు.

ఖాతాదారుల సేవలో ఏలూరి సహకార అర్బన్ బ్యాంక్

తెనాలి శాఖాధికారి శేషుకుమార్



మాట్లాడుతున్న శేషుకుమార్

తెనాలి: వాణిజ్య బ్యాంకులకన్నా మెరుగైన వడ్డీ అందిస్తూ అన్ని వర్గాల ప్రజలకు ది ఏలూరి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ అందుబాటులో ఉందని ఆ బ్యాంక్ తెనాలి శాఖాధికారి శేషుకుమార్ తెలిపారు. స్థానిక కొత్తపేటలోని బ్యాంక్ లో శుక్రవారం జరిగిన ఖాతాదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఖాతాదారుకు వ్యక్తిగత సేవను అందించడానికి తమ బ్యాంక్ ప్రాధాన్యతనిస్తుందని చెప్పారు. బ్యాంక్ అధికారి రవిమోహన్ మాట్లాడుతూ రుణాల మంజూరులో సరళమైన విధానాలను అవలంబిస్తున్నట్లు పేర్కొన్నారు. 10 గంటల నుంచి సాయంత్రం 5.43 గంటల వరకు భోజన విరామం మినహా తమ బ్యాంకు కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిపారు. మూడు దశాబ్దాలుగా ఖాతాదారుల మన్ననలు పొందుతున్నట్లు చెప్పారు. గత ఏడాది తెనాలి శాఖను ప్రారంభించామని, బ్యాంక్ అభివృద్ధికి తోడ్పడాలని ఖాతాదారులను కోరారు. క్యాషియర్ కొంగర దుర్గాభవాని స్వాగతం పలుకగా, ఉద్యోగిని మాలిన్ వందన సమర్పణ చేశారు.

సందడిగా ప్రపంచ రంగస్థల దినోత్సవం



మాట్లాడుతున్న వెనిగళ్ల శివప్రసాద్

తెనాలి: పట్టణానికి చెందిన అభ్యుదయ కళాసమితి ఆధ్వర్యంలో గురువారం రాత్రి ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని నిర్వహించారు. గాంధీనగర్‌లోని 'ఇస్కఫ్' హాలులో ఏర్పాటైన సభకు సంగీత దర్శకుడు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ సమన్వయకర్తగా వహించారు. ప్రపంచ నాటకరంగం నుంచి ఆంధ్రప్రదేశ్‌లో నాటకరంగ పరిస్థితులపై వక్తలు సమీక్షించారు. నటుడు, దర్శకుడు పాతూరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దేశవిదేశాల్లో నాటకరంగ పోకడలను వివరించారు. కళాకారులకు అందుతున్న ప్రోత్సాహకాలను తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులను సత్కరించారు. రచయిత డాక్టర్ రంగిశెట్టి రమేష్, బెల్లంకొండ వెంకట్, వెనిగళ్ల శివప్రసాద్, విష్ణుమొలకల భీమేశ్వరప్రసాద్, కన్నెగంటి మధు, కొప్పరాజు విజయసారథి, వసంతయామిని తదితరులు మాట్లాడారు. అనంతరం అల్లూరి సీతారామరాజు, దుర్యోధనుడు ఏకపాత్రలు, తెలుగుతల్లి ప్రదర్శనలు జరిగాయి.

శ్రీనివాస్ కుటుంబాన్ని ఆదుకోవాలి



మాట్లాడుతున్న ఆర్‌పీఐ పార్టీ నాయకులు

తెనాలి రూరల్: స్థానిక నందులపేటకు చెందిన యువకుడిపై విజయవాడలో గంజాయి బ్యాచ్ దాడి చేసి హత్య చేశారని ఆర్‌పీఐ (రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా) పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పిట్ట వరప్రసాద్ తెలిపారు. మృతుడి కుటుంబాన్ని శుక్రవారం ఆయన పరామర్శించారు. అనంతరం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన చింతకాయల సాయి శ్రీనివాస్ (32) ఫిబ్రవరి 1న విజయవాడ వెళ్లి తిరుగు ప్రయాణంలో రైల్వేస్టేషన్‌కు వస్తుండగా అక్కడ కొందరు యువకులు అతనిపై దాడి చేశారన్నారు. ఫోన్, డబ్బు లాక్కుని వంతెన నుంచి కిందకు పడేశారని, తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ శ్రీనివాస్ నెల రోజులకు మృతి చెందాడని తెలిపారు. దీనిపై విజయవాడ జీఆర్పీ స్టేషన్‌లో కేసు నమోదైందని వివరించారు. మృతుడి తల్లి సుజాత అతని పైనే ఆధారపడి జీవిస్తోందని, ఆమెకు రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు ఉద్యోగం కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మత్తే బాబి, దొడ్డ నాగమల్లిరాజు, పల్నాటి నాగరాజు ఉన్నారు.

జీవన ఎరువులతో భూసార పరిరక్షణ

తెనాలి టౌన్: జీవన ఎరువుల వాడకంతో భూసారం పరిరక్షణ సాధ్యపడుతుందని ఏరువాక కేంద్రం సమన్వయకర్త ఎస్.వెంకటలక్ష్మి పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరులో శుక్రవారం రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వెంకటలక్ష్మి పాల్గొన్నారు. భూసార యాజమాన్యంలో జీవన ఎరువుల వాడకం, ప్రాముఖ్యత తదితర విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ నేలను భూసార పరీక్ష చేయించుకోవాలని రైతులకు సూచించారు. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా పంటను ఎంపిక చేసుకుని నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. భవిష్యత్‌లో వ్యవసాయ రంగాన్ని సమర్థవంతంగా నిర్వహించాలంటే పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీఏఏ నాగరాజు పాల్గొన్నారు.